# సంజీవి పర్వతం

శ్రీ కొడవంటి లీలామోహనరావు

రోడ్డు ప్రక్క నన్ను దింపేసి సర్రున బస్సు ముందుకి సాగిపోయింది. త్రోవంతా బంపీరోడ్‌వల్ల వళ్ళు హూనమైంది. చల్లని పైరుగాలి వంటికి తగిలేసరికి కొంత రిలీఫ్ అన్పించింది. చల్లని మెల్లని పంటకాలువ గల గల మనస్సులో ఉత్సాహం నింపింది. గట్టిగా ఊపిరిపీల్చి, సూట్ కేస్ తీసుకొని బయలుదేరాను. నాలుగడుగులు వేసేసరికి గుండె ఝల్లుమంది. అంతదూరంలో సంజీవి పర్వతం. ఆకాశానికి విస్తరించి ఉంది. నల్లగా చిక్కగా అంతటా చెట్లు. కారుమేఘంలా భయంకరంగా ఉంది.

మామయ్యకి ఆ ఊర్లో షాపు ఉంది. రెండు రోజులు ఐడిల్ గానే గడిపివేసాను. షాపుదగ్గర కొంతసేపు కూర్చోవడం, తిరిగి ఇంటికి రావడం. మామయ్య మొదటే కాషన్ ఇచ్చాడు. "సంజీవి పర్వతంకేసి వెళ్ళకు. మీ ప్రాంతం కొండలాటిదికాదు. పక్కా అడివి." నా సంగతి వాళ్ళకు తెలుసు. ఫ్రెండ్సుతో కలిసి కొండలూ, గుట్టలూ, తిరగడం నాకు అలవాటు. ఆ అడ్వెంచర్సులో కొన్నిసార్లు కొద్దిలో ప్రమాదాలు తప్పడం కూడా జరిగింది. నేనీ ఊరు రాక మునుపే సంజీవి పర్వతం గూర్చి విన్నాను. దానిగూర్చి ఏవో కథలు ఉన్నాయి. ఎవరో గొల్లవాడు కొండ గబగబా దిగుతుండగా కాలికి దెబ్బతగిలిందట. చేతికందిన ఆకులు తెంపి దిగుతూనే పసరు రాసాడట. గాయమైన గుర్తేలేకుండా పోయిందట. అది సంజీవి అని తెల్సుకొని మళ్ళీ దానికోసం ఎంత వెదికినా కన్పడలేదట. అందుకే ఆ కొండకా పేరు.

ఆఖరుకి ఓరోజు ఉదయమే అటువైపు బయలుదేరాను. తోవలో చెట్లనిండా రామచిలకలు విపరీతంగా గోలచేస్తున్నాయి. ఆకులు కనబడనంతగా చిలకలు ఉన్నాయి. ఒక చెట్టుమీదనుండి మరో చెట్టుమీదకి ఎగురుతూ అలికిడి చేస్తున్నాయి. ఆ ప్రాంతం వాటి అరుపులతో చాలా కోలాహలంగా ఉంది. నేనింతవరకూ అటువంటి దృశ్యం చూడలేదు. కొండ మొదట్లో కొందరు మనుషులు కన్పించారు. నావేపు వింతగా చూసారు. నా ప్రయత్నం తెలుసుకొని ఒకరిద్దరు మందలించారు.

కొండంతా జీబుగా ఉంది. సన్నని కాలితోవగుండా ఎక్కడం ప్రారంభించాను. కొంతదూరం వెళ్ళేసరికి ప్రకృతి నాకోసమే సాక్షాత్కరించిందా అన్పించింది. చుట్టూ విశాలమైన ప్రదేశం-ఏరియల్ వ్యూ కన్పడింది. పచ్చని పంటపొలాలు మైళ్ళకొలదీ దూరంగా చిన్న చిన్నగ్రామాలు, వాటిని కలుపుతూ బాటలు-అక్కడా అక్కడా గొంగళీ పురుగుల్లా బస్సులు. చల్లని గాలి కొడ్తోంది. కొంతసేపు అలా చూస్తూ ఉండిపోయాను.

నాలుగడుగులు వేసిం తర్వాత చదునైనచోటు తగిలింది. అక్కడ అనుకోనివిధంగా ఒక సంఘటన జరిగింది. త్రుళ్ళిపడ్డాను. నన్ను చూసి ఆమె కూడా కంగారుపడింది. కాని అంతలోనే సర్దుకొని పుల్లలు ఏరుకోసాగింది. ఇంత ఎత్తులో, ఒంటరిగా-నాకు ఆశ్చర్యం వేసింది. కాని మాట్లాడకుండా కొండ ఎక్కడం కొనసాగించాను. పోను పోను మరి కాలితోవలేదు. మరీ చీదరగా ఉంది. సన్నని కొండ వాగు పారుతూ ఉంది. చెట్లూ, జీబుగా పొదలూ, మార్గంలేదు. మనిషికంటే ఎత్తైన పుట్టలు ఎక్కడ బడితే అక్కడ ఉన్నాయి. కీచురాళ్ళ శబ్దంతప్ప మరేవిధమైన చప్పుడూలేదు. ఎక్కడా పక్షి అరుపైనా విన్పడ్డంలేదు. అటువంటి పరిసరాల్లో ఒంటరిగా ఉన్నానన్న ఆలోచనే భయంకరంగా ఉంది. అప్పటికిక తిరిగి వచ్చేసాను.

కొండ పూర్తిగా ఎక్కినవాళ్ళు లేరని చెప్తారు. ఒకరిద్దరు వెళ్ళినవాళ్ళు తిరిగి రాలేదట. పైని ఎక్కడో నిత్యం తపస్సు చేసుకుంటూ మునీస్వరులు ఉంటారనీ, వాళ్ళ కంటపడినవాళ్ళు తిరిగి రారని చెప్పుకుంటారు. ఏది ఏమైనా చొరరానిదిగా ఉంది. సాధించాలంటే తగిన బందోబస్తుగా వెళ్ళాలి. భయం, సంతోషం, ఆశ్చర్యం వెంటవెంటనే అనుభవంలోకి వచ్చే త్రిల్ ఇది. ఈ ప్రయత్నం విడిచిపెట్టకూడదనుకున్నాను.

ఈసారి వెళ్ళినప్పుడు ఆ అమ్మాయి నీటివాగు దగ్గర కూర్చుంది. కట్టెలమోపు ప్రక్కనుంది. లేవబోతుంటే దగ్గరకు వెళ్ళాను. పేరడిగాను. "లచ్చిమి" అంది. చామన చాయ. మెరిసే కళ్ళు. ఆకర్షణ ఉంది.

"ఎక్కడుంటున్నావు?" అన్నాను.

"ఈ వూరే. మాలపేటలో."

కట్టెలమోపు ఎత్తుకుంది.

"కట్టెలకి ఇంతదూరం ఎందుకు వచ్చావు?"

"నీకోసమే..."

చెంపమీద కొట్టినట్టయింది. విస్తుపోయాను. వెంటనే గట్టిగా నవ్వింది.

"ఒట్టి అన్నా. నాకిటు రావడం అలవాటు" అని గబగబా వెళ్ళిపోయింది,

నేను మాత్రం షాక్‌నుండి తేరుకోలేదు.

ఆ ఊరు చాలా చిన్న గ్రామం. పెంకుటిళ్ళు మూడో, నాలుగో. మిగతావన్నీ పాకలు. హరిజనులందరూ ఒక దగ్గిర. వాళ్ళకి వేరే నుయ్యి. పైవాళ్ళు అక్కడికి పోరు. వాళ్ళంతా పొలాల్లో కూలీ నాలీ చేసుకుంటారు. ఏరోజు కారోజు వెచ్చాలు కొనుక్కుంటారు. ఆ వాడ అంతా చాలా చీదరగా ఉంటుంది. మనుషులంతా రోడ్డుమీదే కూర్చుంటారు. ఇంటి పనులన్నీ రోడ్డుమీదే. వాళ్ళ గుడిసెలు బొరియలు మాత్రమే.

రెండు మూడుసార్లు నేనటుకేసి వెళ్ళడం మామయ్య పసికట్టి నట్టున్నాడు.

"ఒరేయ్ మాలపేటకేసి వెళ్ళకు. తప్పు పడతారు," అన్నాడు.

"నాకా పట్టింపు లేదు. మా వూర్లో మేం హరిజనవాడ కెళ్ళి సోషల్ సర్వీస్ చేసేవాళ్ళం. రోడ్లు తుడిచి, వాళ్ళ పిల్లలకి నీళ్ళుపోసి, పుస్తకాలిచ్చి - రకరకాల పనులు చేసేవాళ్ళం" అన్నాను.

"ఇది మీ పట్నంకాదు. ఇక్కడ ఉన్నన్నాళ్ళూ ఇక్కడ పద్ధతులకి కట్టుబడవలసిందే" అన్నాడు మామయ్య.

నేను మాటాడలేదు. జవాబు చెప్పకుండా నా పని నేను చేసుకుపోవడమే మంచిది.

నేను కొండపైకి వెళ్ళివచ్చేడలా లక్ష్మి కన్పిస్తుంది. "సంజీవి నీకు దొరుకుతుందేమో..." అన్నాను నవ్వింది కాని కళ్ళు సీరియస్‌గా ఉన్నాయి.

"అదంతా ఒట్టిది. అయినా యిప్పుడేందుకు? అవాడు దొరికితేనేమో..." అంది.

నాకు అర్థం కాలేదు.

"నువ్వనేదేమిటి?" అన్నాను.

తనేమీ మాటాడలేదు. నేను కొండపైకి పోడానికి లేచాను.

"అట్టే పైకి పోయాక పానాలు పోతాయి" అని హెచ్చరించింది.

కొంచెం అల్లరి పెట్టాలనిపించింది.

"పోతే యేం?" అన్నాను.

ఊరుకుంది. కొద్దిగా నవ్వుకుందేమో కూడా.

"ఆడ సూసింది సెప్పు" అంది.

బండరాళ్ళున్నచోట ప్రాకి ఎక్కవలసి వచ్చింది. పొదల్లోనుండి దూరి కొంత పైకి పోయాను. చాలా రిస్కీగాఉంది. ముళ్ళు తగిలి చొక్కా చిరిగిపోయింది. ఒళ్ళు అక్కడక్కడ రక్కుకు పోయింది.


# ఆంధ్ర సచిత్ర వారపత్రిక

[ స్థాపితం : 1908 ]

గాంధీనగరం, విజయవాడ-3

ఇంట్లో అందరికీ ఆనందాన్ని ఇచ్చే శీర్షికలు! కథలు!! బొమ్మలు!!!

★ సాహిత్య విలువలున్న సీరియల్ కథలు

★ వైవిధ్యం వున్న కథానికలు

★ అన్ని తరాలవారినీ అలరించే "ప్రశ్నావళి" "ధర్మపథం" కార్టూన్‌లు మొదలైన వాటితో ఏవారానికి ఆ వారమే కొత్తదనాన్ని పుణికిపుచ్చుకుని మీకు అందుతుంది!

విడి ప్రతి వెల 75 పైసలు
సంవత్సర చందా (పోస్టుద్వారా)
రు. 41-60 పై.

ఆరు మాసాలకు రు. 20-80 పై
మీ స్థానిక ఏజంటుద్వారా తెప్పించుకుంటే
ప్రతీవారం తెల్లారేసరికల్లా మీముందు వుంటుంది

రచనలు పంపే చిరునామా :
ఎడిటర్, ఆంధ్ర సచిత్ర వారపత్రిక
గాంధీనగరం, విజయవాడ 3.

ఇతర వివరాలకు :
మేనేజరు, ఆంధ్రపత్రిక
గాంధీనగరం, విజయవాడ 3.

తిరిగి వచ్చేసరికి నాకోసమే ఇంకా బయలు దేరకుండా ఆగినట్టుంది.

"తెలిసిపోవాది. మరేం పెళ్ళక్కర్లేదు" అని పక పకా నవ్వ సాగింది. కల్మిషం లేని నవ్వు, మెరిసేకళ్ళు, చలాకీతనం. నేను మరచి పోలేను.

తరువాత్తరువాత నాకు కొంత సమాచారం తెలిసింది. రెండేళ్ళక్రితంమాట. పెద్దనాయుడుగారి అబ్బాయితో ఆపిల్లకు సంబంధం ఉండేదట. కళ్ళంలో కలిసేవారట. తండ్రికి తెలిసి తిడితే విండ్రిన్ తాగి పోయాట్ట. ఊరంతా ఈ పిల్లనే తిట్టుకున్నారట. ఈ విషయం నన్ను షాక్ చెయ్యలేదు సరికదా నేను ఆవిడ్ని మెచ్చుకోకుండా ఉండలేకపోయాను. ఇంత జరిగాక ఆ తెగువ, పెంకితనం ఆవిడ నిలబెట్టుకుందంటే నేను అభినందించక ఏంచేయను? ఆవిడ వ్యక్తిత్వం ఎంత గొప్పది! నీచంగానూ, హంతకురాలిగానూ చూసే మనుషులమధ్య అంతకంత బింకెగా ఉండడం వీరిటికాక మరేమిటి?

"నువ్వు మీవూరు తిన్నగా వెళ్ళేట్టులేవు" అన్నాడుమామయ్య.

"లేదు, లేదు. నాలుగు రోజుల్లో వెళ్ళిపోతాను" అన్నాను.

మామయ్య ట్రాన్సిషన్ పీరియడ్‌కి చెందుతాడు. కొత్త భావాలూ, కొత్త అభిరుచులూ తెలుసును—కాని నలుగురితోకలిసి పోయేరకం. నన్ను ఖండించనూలేదు. ప్రోత్సహించనూలేదు. తన దగ్గిర ఉన్న ంకీ నేనేమీ ఆవక తవక పనులు చేయకుండా ఉంటే చాలు నతనికి.

ఆరోజు పెందళకడే సంజీవి పర్వతానికి బయలు దేరాను. కొండ వాగు దగ్గర కూర్చొని ఆలోచిస్తున్నాను. అంతలో లక్ష్మి అటు వచ్చింది.

"అప్పుడే ఒచ్చేసావా" అంది.

నాకు గుండెలు తీవ్రంగా కొట్టుకోసాగాయి. బుర్రంతా వేడెక్కి పోయింది. లక్ష్మి నవ్వింది. నా అవస్థకే నవ్వినట్టుగా కంగారు పడ్డాను. చివరకి అన్నాను.

"నేను రెండు మూడు రోజుల్లో మావూరు వెళ్ళిపోతాను."

ఏం మాట్లాడలేదు. ధైర్యం చిక్కబట్టుకున్నాను.

"నాతో వచ్చేయకూడదూ?"

చురుక్కున చూసింది. కళ్ళు ఎరబడ్డాయి.

"అవును. నేను పెళ్ళిచేసుకుంటాను." అన్నాను.

ఆవిడ ఆశ్చర్యం అంతా ముఖంలో కన్పిస్తోంది.

"రా" అని పెద్ద బండమీదికి తీసుకువెళ్ళింది. "కూర్చో" అంది.

దూరంగా పొలాలు. మధ్యలో చిన్నపాక.

"అవును తెలుసు. పిరికివాడు. తన స్వార్థం చూసుకున్నాడు" అన్నాను.

తెల్లబోయింది. పూర్తి లేరకుండానే గబగబా వెళ్ళిపోయింది. నాకేమీ తోచలేదు. నాపని అయినట్టో కానట్టో తెలియలేదు. ఇంటికి తిరిగివచ్చేసాను. ఈ వ్యవహారంలో దిక్కునే పోవాలి. దిగింతరువాత ఏటూ తేలకపోతే అంతకంటే వర్రీ మరొకటుండదు. రెండు రోజులయింది. మరి లక్ష్మి కన్పడలేదు. పిచ్చిగా తిరిగాను. ఇంక కథ ముగిసి పోయిందనుకున్నాను; హరిజనవాడకేసి మాటిమాటికి వెళ్ళాను. కాని ఎక్కడా కన్పడలేదు.

మూడోరోజు ఎప్పటిలాగే కొండకేసి వెళ్ళాను. రోజూవెళ్ళే చోటుకి వెళ్ళేసరికి ఉలికి పడ్డాను. ఎదురుగా రాతిమీద ఒంటరిగా కూర్చొనిఉంది. జబ్బుపడిలేచిన దానిలాగాఉంది. నన్నుచూసి పేలవంగా నవ్వింది.

"ఏమైంది? అన్నాను.

"నువ్వన్నదే నిజం. ఈ రెండ్రోజులూ యమబాధ పడ్డాను" అంది. పాపం ఇన్నాళ్ళూ అతనికి తనమీద వల్లమాలిన ప్రేమ అనే ఆలోచించింది. ఆ ప్రేమ కోసమే చచ్చిపోయాడని అనుకుంది. తాను బతికుందంటే తనకు అంతప్రేమ లేదనీ, తనకి ప్రేమించేశక్తి లేదనీ అనుకుని ఉండాలి. ఆరోజు గుండె తేలిక పడినట్టుగా మాటాడింది.

మరునాడు నేను మామయ్యతో చెప్పి బయలుదేరి పోయాను. నాల్రోజులు పోయాక మారేజి రిజిస్ట్రారు ఆఫీసులో కాగితాలిచ్చి ఇంటికి వచ్చాను. అప్పుడే మామయ్య దగ్గరనుండి ఉత్తరం వచ్చింది, లక్ష్మి నవ్వుతూ పక్కని చేరింది. ఆ ఉత్తరంలో ఒకచోట చూపించాను. "ఈ మధ్య ఊర్లో గడబిడ అయింది. లక్ష్మి అని ఒక మాల పిల్ల సంజీవి పర్వతం మీదికి వెళ్ళి మరి రాలేదు. ఎంత వెదికినా కన్పడలేదు. నీకు చెప్పానుగా - కొండపైకి చాలా మీదికి పోయిన వాళ్ళు తిరిగి రాలేదని. ఇంకానయం, అటువంటి ప్రమాదం నీకు జరగలేదు..."

నేనూ, లక్ష్మి విరగబడి నవ్వుకున్నాం.